క్లుప్తంగా

విరివిగా మొక్కలు నాటాలి..



మొక్క నాటిన ప్రసాద్, తదితరులు

పూసపాటిరేగ: మొక్కలు విరివిగా నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని సమాజ సేవకుడు లోకం ప్రసాద్ అన్నారు. మండలంలోని సీహెచ్ అగ్రహారం సచివాలయం వద్ద సోమవారం మొక్కలు నాటారు. అలాగే పూసపాటిపాలెం, రెల్లివలస గ్రామాలలో కూడా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలు నాటడం వల్ల పర్యావరణం మెరుగుపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో పతివాడ శ్రీనివాస రావు, బాలా అప్పలరాజు, పి.లక్ష్మీనారాయణ, జమరాజు, తదితరులు పాల్గొన్నారు.

టాస్క్‌ఫోర్స్ సీఐగా వెంకటరావు



ఎస్పీ వకుల్ జిందల్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న టాస్క్‌ఫోర్స్ సీఐ బి.వెంకటరావు

విజయనగరం క్రైమ్: జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐగా బాధ్యతలు చేపట్టిన బి.వెంకటరావు సోమవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ వకుల్ జిందల్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఇప్పటివరకు వన్‌టౌన్ సీఐగా బాధ్యతలు చేపట్టిన ఆయన గంజాయి, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు కృషి చేశారు. టాస్క్‌ఫోర్స్ సిబ్బంది సమర్థవంతంగా పనిచేసేలా చూడాలని సీఐ వెంకటరావును ఎస్పీ సూచించారు.

కమిషనర్ పర్యటన



కేఎల్‌పురం ప్రాంతంలో పర్యటిస్తున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: నగరంలోని పలు ప్రాంతాలలో కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య సోమవారం పర్యటించి, పారిశుధ్య పనుల తీరును గమనించారు. ముందుగా కేఎల్ పురం ప్రాంతంలో పర్యటించి అక్కడ నిర్వహిస్తున్న పారిశుధ్య ప్రక్రియను పరిశీలించారు. ఇంటింటి చెత్త సేకరణ ఏ విధంగా జరుగుతున్నదీ అడిగి తెలుసుకున్నారు. అనంతరం అయ్యన్నపేట చేరుకుని ఆ ప్రాంతంలో కాలువల్లో చెత్త తొలగింపు, రహదారుల పరిశుభ్రత వంటి అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలను కోరారు. వర్షాలు కురిసే సమయంలో నీటి నిల్వలు ఎక్కువగా ఉంటాయని, వాటి వల్ల దోమలు వృద్ధి చెందుతాయన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించినప్పుడే రోగాలు ప్రబలకుంటా ఉంటాయని చెప్పారు.

బురదమయంగా జమ్మయ్యపేట రహదారి



జమ్మయ్యపేట రహదారి దుస్థితి

భోగాపురం: గడిచిన మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు సవరవల్లి నుంచి జమ్మయ్యపేట మీదుగా కవులవాడ వెళ్లే రహదారి పూర్తిగా అధ్వానంగా తయారైంది. బురదమయంగా మారడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సవరవల్లి నుంచి కవులవాడ వెళ్లే రహదారిలో కొంతభాగం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణానికి అవసరమని.. దీంతో వేరే మార్గంలో రహదారి ఏర్పాటు చేస్తామని చెప్పి జీఎంఆర్ సంస్థ (ఎయిర్‌పోర్టు కాంట్రాక్టర్) ప్రతినిధులు చెప్పారు. అయితే జీఎంఆర్ సంస్థ ప్రతినిధులు రహదారి నిర్మాణం చేపట్టకుండా, ఆ రహదారికి బదులుగా వేరే మార్గంలో గ్రావెల్ వేసి వదిలేశారు. దీంతో కవులవాడ, జమ్మయ్యపేట, తూడెం గ్రామాలకు చెందిన ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. సమస్యను జీఎంఆర్, మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని వాపోతున్నారు. దీనికి తహసీల్దార్ సురేష్‌ను వివరణ కోరగా... ఈ రహదారి దుస్థితిపై ఫిర్యాదులు వచ్చాయని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

ఘనంగా ఎల్ఐసీ జీవిత బీమా వారోత్సవాలు

విజయనగరం టౌన్: నగరంలోని ఎల్ఐసీ బ్రాంచ్ కార్యాలయంలో జీవిత బీమా 68వ వార్షికోత్సవం సందర్భంగా బీమా వారోత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. తిరుమల ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ తిరుమల ప్రసాద్ జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. కార్యక్రమంలో సీనియర్ బ్రాంచ్ మేనేజర్ ఎస్. జగదీష్‌బాబు, అధికారులు, సిబ్బంది, ఏజెంట్లు పాల్గొన్నారు.

మరుపురాని మహానేతకు నివాళులు..

మాట తప్పని, మడమ తిప్పని మహానేత.. ప్రజా సంక్షేమాన్ని కాంక్షించే ప్రజా హృదయ విజేత దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డికి వాడవాడలా నివాళులర్పించారు. సోమవారం రాజన్న వర్ధంతి సందర్భంగా పట్టణాలు, గ్రామాలు, ముఖ్య కూడళ్లలోని రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి ఆయన చేసిన సేవలను వక్తలు కొనియాడారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆస్పత్రుల్లోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేయడంతో పాటు పలుచోట్ల అన్నదానాలు చేపట్టారు. అద్భుత పరిపాలనతో ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

– విజయనగరం/నెల్లిమర్ల నెట్‌వర్క్





నెల్లిమర్ల రూరల్: మొయిదలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు



నెల్లిమర్ల రూరల్: సతివాడలో నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



భోగాపురం: వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, నాయకులు, కార్యకర్తలు



పూసపాటిరేగ: కుమిలి గ్రామంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు అప్పలనాయుడు, తదితరులు



విజయనగరం ఫోర్ట్: నగరంలోని విద్యుత్ ఉద్యోగుల సంఘ కార్యాలయంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న విద్యుత్ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు ప్రసాదరావు



డెంకాడ: మండల కేంద్రంలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ వాసుదేవరావు, నాయకులు కనక సింహాచలం, తమ్మునాయుడు, తదితరులు



పూసపాటిరేగ: వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పందులు, కుక్కల నియంత్రణకు చర్యలు

- కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: నగరంలో పందులు, కుక్కల సంచారం ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామని, వాటి నియంత్రణకు త్వరలో కార్యాచరణ రూపొందిస్తున్నట్లు విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య తెలిపారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజా సమస్యలపై వినతులు స్వీకరించారు. శానిటేషన్‌కు సంబంధించి 3, రెవెన్యూ విభాగానికి సంబంధించి 3, ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి 3, టౌన్ ప్లానింగ్ సంబంధించి 2 చొప్పున వినతులు అందాయి. వినతులను స్వీకరించిన కమిషనర్ పి.నల్లనయ్య సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు తెలిపారు. సమస్యలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఈఈ కె.శ్రీనివాసరావు, ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి, ఏసీపీ అమ్మాజీ రావు, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ నల్లనయ్య

వ్యక్తిత్వ వికాసానికి కౌన్సెలింగ్

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



హాజరైన ఎంఈఓలు, విద్యాశాఖాధికారులు



మాట్లాడుతున్న కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: విద్యార్థుల వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దేందుకు వారానికి ఒక గంట పాటు కౌన్సెలింగ్ క్లాసులు నిర్వహించాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యాశాఖాధికారులను ఆదేశించారు. 8, 9, 10 తరగతులు ఎంతో కీలకమని.. వివిధ రకాల ఆకర్షణలను లోనయ్యే ఆ వయసులో విద్యార్థులకు మంచి, చెడులను వివరించడం ద్వారా సక్రమ మార్గంలో నడిచేనటట్లు చూడాలని సూచించారు. ఎంఈఓలు, మోడల్ స్కూల్స్, కేజీబీవీ ప్రిన్సిపాళ్లు, సంక్షేమ వసతిగృహాల అధికారులు, కన్వీనర్లు, హెడ్‌మాస్టర్లతో సోమవారం స్థానిక కలెక్టరేట్ ఆడిటోరియంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హాస్టళ్లలో ఎటువంటి అవాంఛిత సంఘటనలు చోటు చేసుకోకుండా విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఇందుకోసం వారికి కౌన్సెలింగ్ నిర్వహించి, విద్యార్థుల ఆలోచనలు, అభిప్రాయాలను తెలుసుకోవాలన్నారు. జిల్లా అధికారులను తీసుకువెళ్లి వారి ప్రసంగాల ద్వారా స్ఫూర్తిని నింపాలని సూచించారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో పదో తరగతికి సంబంధించి శతశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. పాఠశాలలు, హాస్టళ్లలో విద్యార్థుల ఆరోగ్య పరీక్షల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. సమావేశంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి కె.సందీప్‌కుమార్, డీఈఓ ఎన్.ప్రేమకుమార్, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.తిరుపతినాయుడు, డిప్యూటీ ఈఓలు కేవీ రమణ, మోహనరావు, ఎంఈఓలు, తదితరులు పాల్గొన్నారు.

వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

నెల్లిమర్ల రూరల్: తెలంగాణ రాష్ట్రంలోని భువనగిరి జిల్లాలో జరుగుతున్న రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో నెల్లిమర్ల మండలంలోని టిక్కలి సెంచూరియన్ విశ్వవిద్యాలయ విద్యార్థులు సత్తాచాటారు. వర్సిటీలో బీబీఏ చదువుతున్న చిరంజీవి 67 కిలోల విభాగంలో స్నాచ్ 101 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్ 115 కిలోల చొప్పున మొత్తం 216 కిలోల బరువును ఎత్తి జూనియర్ విభాగంలో స్వర్ణం, సీనియర్ విభాగంలో రజత పతకం సాధించాడు. వర్సిటీకి చెందిన మరో విద్యార్థిని మౌనిక 76 కిలోల కేటగిరీలో స్నాచ్ 65 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్ 85 కిలోలే చొప్పున మొతం 150 కిలోల బరువును ఎత్తి జూనియర్ విభాగంలో స్వర్ణం, సీనియర్ విభాగం రజత పతకం సాధించింది. ఆ విద్యార్థులకు చాన్స్‌లర్ జీఎస్ఎన్ రాజు, వీసీ పీకే మహంతి, స్పోర్ట్స్ డైరెక్టర్ నారాయణ, కోచ్ అర్జున్ అభినందనలు తెలిపారు.



స్వర్ణ పతకాలతో మౌనిక, చిరంజీవి

ప్రతి అర్జీకి పరిష్కారం



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

- అధికారులకు కలెక్టర్ ఆదేశాలు
- ప్రజావినతుల పరిష్కార వేదికకు 215 అర్జీలు

విజయనగరం అర్బన్: ప్రజా వినతుల పరిష్కార వేదికకు వచ్చిన ప్రతి అర్జీని పరిష్కరించే దిశగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా వినతుల పరిష్కార వేదికకు వచ్చిన అర్జీలపై క్షేత్రస్థాయి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. వివిధ వర్గాల ప్రజలు తెలియజేసిన సమస్యలను వారికి సంతృప్తి కలిగేలా పరిష్కరిస్తూ ప్రతి అర్జీకి సంపూర్ణ పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్‌డీఅనిత ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు పరిష్కారం నిమిత్తం సూచనలు చేశారు. ప్రజల నుంచి వచ్చిన 215 వినతుల్లో అత్యధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించి 137 రాగా, డీఆర్‌డీఏకు 13, మున్సిపల్ శాఖకు 9, ఈపీడీసీఎల్ 6, పంచాయతీ రాజ్, వైద్యారోగ్యశాఖ, గ్రామ వార్డు సచివాలయ శాఖలవి 5 అర్జీలు ఉన్నాయి. అలాగే డీసీహెచ్ఎస్, హౌసింగ్ శాఖలకు 2 చొప్పున వినతులు వచ్చాయి.

గొర్రిపాటి బుచ్చి అప్పారావు పేరు కొనసాగించాలి

జిల్లాలోని తాటిపూడి జలాశయానికి గత ప్రభుత్వం పెట్టిన స్వర్గీయ గొర్రిపాటి బుచ్చి అప్పారావు పేరునే కొనసాగించాలని కోరుతూ కొప్పుల వెలమ సంక్షేమ సంఘం పట్టణ కమిటీ ప్రతినిధులు కలెక్టర్ అంబేడ్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇటీవల ఆ పేరును రద్దు చేసి కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను వెనక్కి తీసుకోవాలని కోరారు. దీనికి కలెక్టర్ స్పందిస్తూ ఈ అంశం జిల్లా స్థాయిలో పరిష్కరించలేమని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తామని హామీ ఇచ్చారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో వై.తాతబాబు, బలగ సత్యనారాయణ, కె.ఆదినారాయణ, గోపాల్, కొల్లి సత్యం, బడే సుగుణాకర్ తదితరులు ఉన్నారు.

ఎయిర్‌పోర్టు భూములకు పరిహారం ఇవ్వాలి

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం కోసం భూములు ఇచ్చిన ఎ.రావివలస, గూడెపువలస, కంచేరు తదితర గ్రామాల రైతులకు భూములకు నష్టపరిహారం నేటికీ చెల్లించలేదని ఎ.రావివలసకు చెందిన శివారెడ్డి ఆధ్వర్యంలో రైతులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దీనికి కలెక్టర్ స్పందిస్తూ రెవెన్యూ అధికారులతో సమీక్షించి ప్రభుత్వానికి నిధుల కోసం తెలియజేస్తామని హామీ ఇచ్చారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

గుర్ల: ఎరువులను అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎరువుల దుకాణాల యజమానులను ఏఓ ఎం.తిరుపతిరావు హెచ్చరించారు. కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్నట్లు రైతులు ఆరోపిస్తుండ డంతో మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాల్లో సోమవారం ఆయన తనిఖీలు చేశారు. రికార్డులతో పాటు ఎరువుల నిల్వలను పరిశీలించారు. అధిక ధరలకు విక్రయిస్తే దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏఓ తిరుపతిరావు

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

- ఆరు పోలీస్ స్టేషన్ల పరిధిలో పది చోరీలు
- నిందితుడి నుంచి రూ 1.50 లక్షల విలువైన రాగి, అల్యూమినియం దిమ్మలను స్వాధీనం చేసుకున్న పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ వకుల్ జిందల్



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్ (వెనుక ముసుగులో నిందితుడు)

విజయనగరం క్రైమ్: జిల్లాలోని నెల్లిమర్ల, పూసపాటిరేగ, డెంకాడ, చీపురుపల్లి, ఆంధ్ర, బొబ్బిలి పోలీస్ స్టేషన్ల పరిధిలో ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్లను చోరీ చేసిన బృందంలోని చీపురుపల్లి మండలం పేరిపి గ్రామానికి చెందిన ఎలక గణేష్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, నిందితుడి నుంచి రూ. 1.50 లక్షల విలువైన రాగి, అల్యూమినియం దిమ్మలను రికవరీ చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. నెల్లిమర్ల మండలం కొండవెలగాడ, కొత్తపేట, గుషిణి, పారసం, చంద్రంపేట గ్రామాల్లో వ్యవసాయ పొలాలకు విద్యుత్ సరఫరా చేసేందుకు ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ వారు ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు చోరీలకు గురయ్యాయి. అదేవిధంగా పూసపాటిరేగ, డెంకాడ, చీపురుపల్లి, ఆంధ్ర, బొబ్బిలి పోలీస్ స్టేషన్ పరిధిలో కూడా ఇదే తరహా నేరాలు జరిగాయి. దీంతో ఇటువంటి నేరాలకు అడ్డుకట్ట వేయాలని ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించడంతో విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు, సీసీఎస్ సీఐ ఎ.సత్యనారాయణ, భోగాపురం సీఐ జి.రామకృష్ణ ఆధ్వర్యంలో పలువురు సిబ్బంది ఒక బృందంగా ఏర్పడ్డారు. ఈ క్రమంలో సీసీఎస్ పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు నెల్లిమర్ల ఎస్సై ఆధ్వర్యంలో సిబ్బంది సోమవారం ఉదయం మిమ్స్ ఆస్పత్రి సమీపంలో వాహన తనిఖీలు చేపడతుండగా.. గుర్ల వైపు నుంచి విజయనగరం వైపు వస్తున్న ఒక ఆటోలో వెనుకన కూర్చొన్న ఒక వ్యక్తి పోలీసులను చూసి ఒక మూటతో పారిపోతుండగా... పోలీసులు అతడ్ని అదుపులోకి తీసుకున్నారు. అతడ్ని విచారించగా..తన పేరు గణేష్ అని, చీపురుపల్లి మండలం పేరిపి గ్రామమని.. తన బంధువులైన పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరుకు చెందిన సారికి దుర్గారావు, సారికి సురేష్, ముంగిన అజిత్ కుమార్‌తో కలిసి ట్రాన్స్‌ఫార్మర్లు దొంగిలిస్తుంటానని పోలీసులకు చెప్పాడు. నెల్లిమర్ల, పూసపాటిరేగ, డెంకాడ, చీపురుపల్లి, ఆంధ్ర, బొబ్బిలి పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ట్రాన్స్‌ఫార్మర్లను చోరీ చేశామని.. దొంగలించిన రాగి, అల్యూమినియం వైరులను వారు కొవ్వూరు తీసుకుని వెళ్లిపోయి.. తన వాటాగా 10 రాగి, రెండు అల్యూమినియం దిమ్మలు ఇచ్చారన్నారు. నిందితుడి నుంచి లక్షన్నర రూపాయల విలువైన రాగి, అల్యూమినియం దిమ్మలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు ఛేదనలో క్రియాశీలకంగా వ్యవహరించిన సీసీఎస్ సీఐ ఎ.సత్యనారాయణ, భోగాపురం సీఐ జి.రామకృష్ణ, నెల్లిమర్ల ఎస్సై రామగణేష్, సీసీఎస్ పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

46 ఫిర్యాదుల స్వీకరణ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు 46 ఫిర్యాదులు వచ్చినట్లు ఎసీప వకుల్ జిందల్ తెలిపారు. ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలంటూ సంబంధిత అధికారులకు ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు, డీసీఆర్‌బీ సీఐ జె.మురళి, ఎస్‌బీ సీఐలు కేకేవీ విజయనాథ్, ఎ.వి.లీలారావు, ఎస్ఐ మురళీ, తదితరులు పాల్గొన్నారు.

నర్సిపల్లిలో వైద్యశిబిరం

మెంటాడ: మండలంలోని సోంపురం పంచాయతీ నర్సిపల్లి మెట్టవద్ద బొద్దాం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 30 మందికి వైద్య సిబ్బంది వివిధ పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్తులకు అవగాహన కల్పిం చారు. కాచిన నీటిని తాగాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఎంఎల్‌హెచ్‌పీ అరుణ్‌కుమార్, ఆరోగ్య కార్యకర్త స్వప్నకుమార్, హెల్త్ అసిస్టెంట్ శేఖర్, ఆశ కార్యకర్త వసంత పాల్గొన్నారు.

కోర్టు తీర్పు అమలులో అశ్రద్ధ తగదు..

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: ప్రభుత్వ శాఖలకు సంబంధించి ఏదైనా అంశంపై కోర్టులు ఇచ్చిన తీర్పులను అమలు చేయడంలో అశ్రద్ధ చేయవద్దని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జిల్లా అధికారులను ఆదేశించారు. వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించి వివాదాలపై కోర్టుల నుంచి వచ్చే నోటీసులకు నిర్ణీత గడువులోగా సమాధానాలు దాఖలు చేసే బాధ్యత ఆయా ప్రభుత్వ శాఖల అధికారులపైనే ఉంటుందని స్పష్టం చేశారు. అన్ని శాఖల జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు కోర్టు తీర్పులు, ఉత్తర్వుల పట్ల అప్రమత్తంగా ఉంటూ జిల్లా యంత్రాంగానికి ఇబ్బందికర పరిస్థితులు తలెత్తకుండా స్పందించాలన్నారు. కోర్టు కేసులపై స్పందించడంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ మేరకు కలెక్టరేట్ నుంచి మండల స్థాయిలోని తహసీల్దార్లు, ఎంపీడీఓలతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అన్ని ప్రభుత్వ శాఖలు తమ పరిధిలో ఉన్న కోర్టు కేసుల సమాచారాన్ని వెంటనే కలెక్టర్ కార్యాలయానికి అందించాలని సూచించారు.

అప్రమత్తంగా ఉండాలి..

ఈ నెల 6, 7వ తేదీల్లో బంగాళాఖాతంలో మరో తుఫాన్ ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ హెచ్చరికల కేంద్రం తెలియజేస్తున్న నేపథ్యంలో అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురిసినట్లయితే జిల్లా నుంచి ప్రవహించే నదుల్లో వరద ప్రవాహం పెరిగే అవకాశం ఉంటుందని, అందువల్ల వాటి పరిస్థితిని నిరంతరం గమనించాలన్నారు.